వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద పనులు పరిశీలించిన ఎమ్మెల్యే గాంధీ

లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిర్మాణ పనుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

శేరిలింగంపల్లి, మార్చి 15: అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అధికారులకు సూచించారు. శుక్రవారం శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరద ముంపు సమస్య శాశ్వత పరిష్కారం దిశగా రూ.4 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న బాక్స్ కల్వర్ట్, వరద నీటి కాలువ నిర్మాణం పనులను ఆయన కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఎన్నో ఏళ్ల నుంచి సమస్య అలాగే ఉందని, భారీ వర్షం వస్తే వరద నీరు రోడ్డుపై పొంగి పొర్లుతూ వాహనదారులకు అత్యంత ఇబ్బందికరంగా మారుతుందని అన్నారు. ప్రస్తుతం నిర్మిస్తున్న బాక్స్ కల్వర్ట్, వరద నీటి కాలువ వల్ల సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందని, ప్రజలు ఎన్నో ఏళ్ల నుంచి ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగిపోతాయని అన్నారు. అభివృద్ధి పనుల విషయంలో నాణ్యతను పాటించాలని, ఎక్కడా రాజీ పడకూడదని అధికారులను ఆదేశించారు. పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎస్ఈ శంకర్ నాయక్, ఈఈ కేవీఎస్ రాజు, డీఈ దుర్గాప్రసాద్, ఏఈ సంతోష్ రెడ్డి, చందానగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి, పార్టీ నాయకుడు సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం

మియాపూర్, మార్చి 15 : కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేయటం హర్షనీయమని కమ్మ సేవా సంఘాల సమాఖ్య గౌరవ అధ్యక్షుడు చలసాని వెంకటేశ్వర్‌రావు, రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఆర్థికంగా వెనకబడి ఉన్న కమ్మ వారికి కార్పొరేషన్ వల్ల ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే గాంధీ శుక్రవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రత్యేక చొరవతో కార్పొరేషన్ ఏర్పాటు చేయటం పట్ల సీఎం రేవంత్‌రెడ్డికి ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు పట్ల సంఘం రాష్ట్ర నేతలు రామకృష్ణ, అడుసుమిల్లి వెంకటేశ్వర్‌రావు, పాతూరి వెంకట్‌రావు, చంద్రమౌళి హర్షం వ్యక్తం చేశారు.

అభినందనీయం..

దుండిగల్: తెలంగాణ ప్రాంతంలోని కమ్మ కుటుంబాల ఆర్థికాభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందిదనీయమని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వాకలపూడి రంగరాయ ప్రసాద్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని కమ్మ సామాజికవర్గం ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల ఆర్థికాభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో రంగరాయ ప్రసాద్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

మల్కాజిగిరిలో బీఆర్ఎస్‌దే విజయం

మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని సన్మానించి అభినందిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, పార్టీ శ్రేణులు

కుత్బుల్లాపూర్,మార్చి15: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించిన అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకొని గులాబీ జెండాను ఎగురవేస్తామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి తన గెలుపునకు సహకరించాలని కోరుతూ మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను తన నివాసంలో కలిశారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృష్ణారావును కలిసిన మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

ఎమ్మెల్యే కృష్ణారావును కలిసిన బీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి ..

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 15 : మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో మల్కాజిగిరి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ఎమ్మెల్యే కృష్ణారావును కలిశారు. ఈ సందర్భంగా వారిద్దరు మాట్లాడుతూ.. ప్రజలందరి ఆశీర్వాదంతో మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాలను బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఇప్పుడు జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో సైతం ప్రజలందరూ బీఆర్ఎస్ పార్టీని ఆదరిస్తారని భారీ మెజార్టీతో విజయాన్ని అందిస్తారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలున్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

సాపూర్‌నగర్‌లోని జలమండలి కార్యాలయం అధికారులతో ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

దుండిగల్,మార్చి15: వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. గాజులరామారం సర్కిల్, సూరారం డివిజన్ పరిధి, షాపూర్‌నగర్‌లోని జలమండలి కార్యాలయంలో అధికారులతో ఆయన తాగునీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు వేసవిలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టి నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, జలమండలి డీజీఎం అప్పలనాయుడు, సిబ్బంది రోహిణి, అనూష, రమ్యభారతి, పూజిత తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ..

గాజులరామారం డివిజన్ దేవేందర్ నగర్‌లోని కుత్బుల్లాపూర్ మండలం తాసీల్దార్ కార్యాలయంలో 41మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే వివేకానంద్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, తాసిల్దార్ అబ్దుల్ రెహమాన్ ఖాన్, ఆర్ఐ రేణుక, డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు విజయ రాంరెడ్డి,సీనియర్ నాయకులు కస్తూరి బాల్‌రాజ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు దూదిమెట్ల సోమేశ్ యాదవ్, జగద్గిరిగుట్ట, సుభాష్‌నగర్ డివిజన్ల అధ్యక్షులు రుద్ర అశోక్, పోలే శ్రీకాంత్, చిన్నచౌదరి, బాలయ్య నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నగేశ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గండిమైసమ్మ-దుండిగల్ తాసీల్ కార్యాలయంలో..

దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, గండిమైసమ్మలోని గండిమైసమ్మ-దుండిగల్ తాసీల్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీల పరిధిలోని 28మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 6గురు లబ్ధిదారులకు చైర్‌పర్సన్ సన్నశ్రీశైలంయాదవ్, దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని 22మంది లబ్ధిదారులకు మున్సిపాలిటీ వైస్ చైర్మన్ తుడుం పద్మారావు రెవెన్యూ అధికారులతో కలిసి చెక్కులు పంపిణీ చేశారు.

ఇష్టంతో చదువాలి..

జీడిమెట్ల: విద్యార్థులు ఇష్టంతో చదువుల్లో ముందుకెళ్లినప్పుడే భవిష్యత్‌లో ఉజ్వల భవిష్యత్‌కు బాటలు పడుతాయని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. సత్‌గ్యాన్ విద్యాసంస్థలో భాగమైన నేతాజీ హైస్కూల్ 14వ వార్షికోత్సవం సుభాష్‌నగర్ డివిజన్ భాగ్యలక్ష్మికాలనీలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, డా.సత్యనారాయణ హాజరయ్యారు. ఈ వేడుకల్లో కార్పొరేటర్ గుడిమెట్ల హేమలతసురేశ్‌రెడ్డి, సత్‌గ్యాన్ స్కూల్ చైర్మన్ లయన్ చింతల మల్లేశం, నేతాజీ స్కూల్ కరస్పాండెంట్ చింతల మహేశ్‌కుమార్‌యాదవ్‌తో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటా..

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 15 : పారిశ్రామిక వాడలో పని చేసే కార్మికులందరికి ఎల్లవేళలా అండగా ఉంటానని బీఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం రాష్ట్ర నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ అన్నాడు. కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్ పారిశ్రామికవాడలోని ఆకృతి ఎంటర్ ప్రైజెస్ కంపెనీలో సంతోష్ అనే కార్మికుడు పనిచేసి మానేశాడు. అతనికి రావాల్సిన గ్రాడ్యువిటీ డబ్బులను ఇవ్వడానికి యాజమాన్యం నిరాకరించగా బాధిత కార్మికుడు రవిసింగ్‌ను ఆశ్రయించాడు. శుక్రవారం సంస్థ యాజమాన్యంతో మాట్లాడి కార్మికుడికి రావాల్సిన రూ.45 వేలు గ్రాడ్యువిటీ డబ్బులను ఇప్పించాడు. కార్యక్రమంలో అనీల్‌కుమార్, సుదర్శన్, జగన్, ప్రేమ్, బాబూరావు తదితరులున్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయండి

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని తులసీనగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాణ పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కార్పొరేటర్ దొడ్ల కోరారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, మల్లేశ్, నాగరాజు, సాయి, రవికుమార్ పాల్గొన్నారు.

– మియాపూర్, మార్చి 15

సెంట్రల్ డివైడర్‌తో ట్రాఫిక్ సమస్యల పరిష్కారం..

హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న సెంట్రల్ డివైడర్ పనులను కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీటి నిర్మాణంతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. డివైడర్ మధ్యలో మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంపొందిస్తామని కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహదేవ్, వెంటకరెడ్డి, గోపాల్‌రెడ్డి, మల్లికార్జున్, రంగారావు, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్, గోపి పాల్గొన్నారు.

– మియాపూర్, మార్చి 15

భగత్‌సింగ్ త్యాగాలు స్ఫూర్తిదాయకం

కేపీహెచ్‌బీ కాలనీలో భగత్‌సింగ్ విగ్రహావిష్కరణలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 15 : భరతమాత సంకెళ్లను తెంపడానికి ఉరికంబమెక్కిన మహనీయుడు భగత్‌సింగ్ అని.. భగత్‌సింగ్ పోరాటాలు నేటితరానికి స్ఫూర్తిదాయకమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్ భగత్‌సింగ్‌నగర్ ఫేజ్-1 వసంతనగర్ కమాన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన భగత్‌సింగ్ విగ్రహాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేశ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రిటిష్ పాలకులను తరిమికొట్టేందుకు భగత్‌సింగ్ లాంటి ఎందరో మహనీయులు ప్రాణాలర్పించారన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు శేరి సతీశ్‌రెడ్డి, కొప్పిశెట్టి దినేశ్‌కుమార్, గొట్టిముక్కల వెంకటేశ్వర్‌రావు, తూము వేణు, గంధం రాజు, ప్రతాప్‌రెడ్డి, రాఘవేందర్, లక్ష్మయ్య, ప్రవీణ్ కుమార్, మధుగౌడ్, రమేశ్, మల్లికార్జున్ యాదవ్, మధు, శివ చౌదరి, పుష్పారెడ్డి, రజిత, రేష్మా, వనజ, సంధ్య ఉన్నారు.

కబ్జాకోసం ప్రమాదకరంగా కూల్చివేతలు

జగద్గిరిగుట్ట, మార్చి 15: కబ్జాదారులు ప్రమాదకర ప్రాంతాలనూ వదలడంలేదు. జగద్గిరిగుట్ట పరిసరాల్లోని స్థలాలను స్వాహాచేసిన కొందరు మిగిలిపోయిన వాటిపై దృష్టిసారిస్తున్నారు. భారీగుంతలు, బండరాళ్లు, హైటెన్షన్ వైర్లకింద కూడా ఆక్రమణకు తెగిస్తున్నారు. పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎత్తైన ప్రాంతంలో మట్టిపోసి ఆధీనంలో ఉంచుకున్నారు. రాజీవ్‌గృహకల్ప సమీపంలో భారీ బండలను పగులగొడుతున్నారు. బండలు పడిపోతే పరిసరాల్లోని వారికి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. వేంకటేశ్వర ఆలయం సమీపంలో హైటెన్షన్ వైర్ల సమీపంలో ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినా అధికారులు దృష్టిపెట్టడం లేదు. ఇప్పటికే ఆలయం సరిసరాల్లో చాలావరకు భూమి కులసంఘాలు, ఇతర ఆలయాల నిర్వాహకుల చేతిలోకి వెళ్లిపోయింది. ఇకనైనా రెవెన్యూ, దేవాదాయ అధికారులు పరిశీలించి బాధ్యులపై చర్యలు చేపట్టాల్సి ఉంది.

‘మగత నిద్రలో డ్రైవింగ్ ప్రమాదకరం’పై అవగాహన

ట్రాఫిక్ సీఐ రాజశేఖర్ రెడ్డికి మెమెంటోను అందజేస్తున్న కాంటినెంటల్ హాస్పిటల్ సీఎండీ డాక్టర్ గురు ఎన్.రెడ్డి

శేరిలింగంపల్లి, మార్చి 15: గచ్చిబౌలిలోని కాంటినెంటల్ హాస్పిటల్‌లో ప్రపంచ నిద్ర దినోత్సవం (వరల్డ్ స్లీప్ డే) సందర్భంగా శుక్రవారం డ్రౌసీ డ్రైవింగ్ ప్రివెన్షన్ (మగత నిద్రలో డ్రైవింగ్ ప్రమాదకరం) అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హాస్పిటల్‌తోపాటు సైబరాబాద్ పోలీస్ విభాగం కలిసి సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో ఆర్‌టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.కృష్ణకాంత్, ఆర్‌టీసీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.శైలజామూర్తి, డాక్టర్ పి.శ్రీనివాస్‌తోపాటు హాస్పిటల్ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ గురు ఎన్.రెడ్డి, పోలీసులు, ఆర్‌టీసీ ఉన్నతోద్యోగులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి ట్రాఫిక్ సీఐ రాజశేఖర్ రెడ్డి, పల్మనాలజిస్టు, స్లీప్ స్పెషలిస్ట్ డాక్టర్ నళిని నాగళ్ల, న్యూరో సర్జన్స్ డాక్టర్ అజయ్ రెడ్డి, డాక్టర్ రణధీర్ కుమార్, మెదడు సంబంధిత శస్త్ర చికిత్సలు నిర్వహించే వైద్యులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కొండాపూర్, మార్చి 15 : గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన సంఘటన చందానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ ఎంఐజీ సమీపంలోని నలగండ్ల రైల్వే బ్రిడ్జ్ క్రింద గుర్తుతెలియని వ్యక్తి (50) పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించగా, సదరు వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించారు. మృతదేహాన్ని గాంధీ దవాఖానకు తరలించినట్లు తెలిపారు.

వీఎన్ఆర్ వీజేఐఈటీ కళాశాలలో సంప్రదాయ దినోత్సవం

దుండిగల్,మార్చి15: వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(వీఎన్ఆర్‌వీజేఐఈటీ) కళాశాలలో నిర్వహిస్తున్న ‘సిన్టిలేషన్స్-2కే24’ కల్చరల్ ఫెస్ట్‌లో భాగంగా శుక్రవారం రెండవరోజు కల్చరల్‌ఫెస్ట్ నిర్వహించారు.‘ఎథ్నిక్ డే’ పరుతో జరిపిన ఈ వేడుకల్లో విద్యార్థిని, విద్యార్థులు రంగురంగుల సంప్రదాయ దుస్తులు ధరించి సందడి చేశారు.

మహిళా దినోత్సవం

అల్లాపూర్,మార్చి15: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హెచ్‌హెచ్ స్పోర్ట్స్ అండ్ సిల్వర్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో అల్లాపూర్ డివిజన్ బీజేపీ నాయకురాలు పులిగొళ్ల శ్రీలక్ష్మియాదవ్‌ను ఈటెల జమున, ఆకుల లలిత శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు

బాలానగర్, మార్చి 15 : ఫతేనగర్ కనకదుర్గ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. శుక్రవారం ఆలయ కమిటీ, ఆలయ పూజారి దోర్భల కాశీనాథ్ శర్మల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పసుపుబొట్టు, కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు నిర్వహించారు.

ఆదర్శవంతంగా ధోబీఘాట్‌ల అభివృద్ధి

కేపీహెచ్‌బీ కాలనీలో ధోబీఘాట్‌లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు, అధికారులు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 15 : కేపీహెచ్‌బీ కాలనీలో ధోబీఘాట్‌లను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు నిధులు మంజూరు చేసినట్లు కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని కాలనీ 3, 7వ ఫేజ్‌లో ధోబీఘాట్‌లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ ఆనంద్, ఏఈ సాయిప్రసాద్, దోబీఘాట్ అసోసియేషన్ నేతలున్నారు.

భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టండి

దుండిగల్,మార్చి15 : నవగ్రహ ప్రతిష్ఠా, మహా కుంభాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలని, ఈ మహోత్సవానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మేయర్ కొలన్ నీలా గోపాల్ రెడ్డి అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, 17వ డివిజన్ కార్పొరేటర్, ఆలయ కమిటీ చైర్మన్ ఆగం రాజు ముదిరాజ్ పాటు డివిజన్ అనుబంధ కమిటీల సభ్యులు, నాయకులు మేయర్ కొలన్ నీలా గోపాల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వచ్చే నెల(ఎప్రిల్) 15వ తేదీన కౌసల్య కాలనీలోని శ్రీ వెంకట శివ రామాలయంలో నిర్వహించే సీతారామాంజనేయ, శ్రీదేవి భూదేవి సహిత వేంకటేశ్వర, శ్రీ శివపంచాయతన శ్రీ లలితా పరమేశ్వరి నవగ్రహ ప్రతిష్ఠా, మహ కుంబాభిషేక మహోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేయాలని ఆహ్వానించారు. అనంతరం ఈ మహోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను మేయర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, అనుబంధ కమిటీల సభ్యులు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం..

కుత్బుల్లాపూర్,మార్చి15: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన సంఘటనలో వ్యక్తి దుర్మరణం పాలైన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ రాంనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. బహదూర్‌పల్లి గ్రీన్‌హిల్స్ కాలనీకి చెందిన షేక్ మహబూబ్(47) గురువారం రాత్రి 7:30 గంటల సమయంలో దేవరాంజల్‌లోని పని మీద వెళ్లి తిరిగి తన ఇంటికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా మార్గమధ్యలో కొంపల్లి నుంచి దేవరాంజయల్‌కు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో షేక్ మహబూబ్ రోడ్డుపై పడడంతో తీవ్రగాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కొడుకు ఎస్‌కే కైసర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్ట్ గ్యాలరీలో చిత్ర ప్రదర్శనలు

కొండాపూర్, మార్చి 15 : మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శనివారం ‘ట్రాన్సెండెంటల్ రియాలిటీ’ పేరిట కళాకారుడు విజయ్‌కుమార్ తన చిత్రాలతో సోలో ప్రదర్శనను ఏర్పాటు చేయనున్నట్లు ఆర్ట్ గ్యాలరీ నిర్వహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో పాటుగా కళాకారుడు శ్రీనివాస్, డాక్టర్ శ్వేతాలు ఏర్పాటు ‘స్పందన’ పేరిట మరో పెయింటింగ్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శనలకు ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ వీసీ అండ్ ఎండీ డాక్టర్ లక్ష్మీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఆక్రమణను కూల్చేందుకు వెళ్లి.. వెనుదిరిగిన అధికారులు

అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జీడిమెట్ల విలేజ్‌వాసులు

కుత్బుల్లాపూర్,మార్చి15: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల 132 డివిజన్ పరిధి జీడిమెట్ల విలేజ్ పోస్టాఫీస్ వెనకాల నుంచి ఇటీవల కోల్‌కాల్వ నిర్మాణం చేపట్టారు. నిర్మాణం చేపట్టిన అనంతరం దానికి ఆనుకొని ఉన్న ఓ బహుళ అంతస్తుల నిర్మాణదారుడు నాలా మధ్యలో స్లాబ్‌ను ఆక్రమించి ప్రహరీ నిర్మాణం చేపట్టారు. దీంతో జీడిమెట్ల గ్రామస్తులు దీనిపై కుత్బుల్లాపూర్ టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో స్పందించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బందితో పాటు డెమాలిషన్ టీంతో కలిసి శుక్రవారం నాలాను ఆక్రమించిన ప్రహరీ కూల్చేందుకు వెళ్లారు. కానీ కూల్చకుండానే అధికారులు, సిబ్బంది వెనుదిరగడం పట్ల గ్రామస్తులు వారి పనితీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై సంబంధిత కుత్బుల్లాపూర్ టౌన్ ప్లానింగ్ విభాగం ఏసీపీ సాయిబాబాను వివరణ కోరగా నాలాపై జరుగుతున్న ప్రహరీ నిబంధనలకు విరుద్ధమే. కానీ గతంలో నాలా నిర్మాణం చేసే సమయంలో నిర్మాణదారుడి స్థలం నుంచే నాలాను నిర్మించడం జరిగిందని, మరోసారి నేరుగా ఉన్నతాధికారులతో వెళ్లి సందర్శించి నిబంధనలకు విరుద్ధంగా ఉంటే కూల్చివేస్తామని చెప్పడం గమనార్హం.

అదిరిన హై లైఫ్ ..

వస్త్రాలు, ఆభరణాలు, గృహోపకరణ ఉత్పత్తులకు మాదాపూర్‌లోని హెచ్ఐసీసీ వేదికైంది. హై లైఫ్ ఎగ్జిబిషన్ పేరిట ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నటీమణులు దివి, స్రవంతి, మిస్ ఇండియా తెలంగాణ 2023 ఊర్మిళ చౌహాన్‌లు విచ్చేసి నిర్వాహకుడు డోమినిక్‌తో కలిసి శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేయడం జరిగింది. ఈ ప్రదర్శన ఈ నెల 17వ తేదీ వరకు కొనసాగనున్నది. అనంతరం మోడల్స్ సెల్ఫీలు దిగుతు సందడి చేశారు.

– మాదాపూర్, మార్చి 15

మిస్ టీన్ గ్రాండ్ యూనివెర్సో ఫెస్ట్ రన్నరప్‌గా ప్రార్థన సంపతి


కొంపల్లిలోని శివశివాని విద్యాసంస్థల ఆవరణలో జరిగిన స్వాగత వేడుకల్లో ప్రార్థన సంపతిని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం, కుటుంబ సభ్యులు

కుత్బుల్లాపూర్,మార్చి15: మిస్ టీన్ గ్రాండ్ ఇండియా కిరిటాన్ని కైవసం చేసుకున్న ప్రార్థన సంపతి ప్రపంచస్థాయిలో జరిగిన మిస్ టీన్ గ్రాండ్ యూనివెర్సోలో ఫస్ట్ రన్నర్ ఆఫ్‌గా తొలి ఆసియావాసిగా గుర్తింపును సాధించింది. ఫిబ్రవరి 27న సౌత్‌అమెరికాలోని కొలంబియాలో జరిగిన మిస్ టీన్ గ్రాండ్ యూనివెర్సో ఫెస్ట్‌లో ప్రపంచంలో మొత్తం 36 మంది యువతులు హాజరు కాగా దీనిలో హైదరాబాద్ నగరానికి చెందిన శివశివాని విద్యాసంస్థల డిప్యూటీచీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.శైలేశ్ సంపతి కూతురు ప్రార్థన పంపతి ప్రతిభను చాటి ఫస్ట్ రన్నరప్‌గా నిలిచిన తొలి భారతీయురాలిగా, తొలి ఆసియా వాసిగా గుర్తింపు సాధించింది. అమెరికా నుంచి ఇండియాకు వచ్చిన సందర్భంగా శుక్రవారం కొంపల్లిలోని శివశివాని కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు ఆమెకు ఘనంగా స్వాగతం తెలిపి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివశివాని విద్యాసంస్థల పీజీడీఎం కళాశాల డైరెక్టర్ డా.రమణారావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మమత, స్కూల్ ప్రిన్సిపాల్ శారదా, ఇంటర్ కళాశాల ప్రిన్సిపాల్ మదన్ ప్రార్థన సంపతి, అసోసియేషట్ వైస్ ప్రెసిడెంట్ దీపికా సంపతితో పాటు అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన తొమ్మిది మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే కృష్ణారావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనారోగ్యంతో వైద్యశాలలో చేరిన పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నేతలున్నారు.

– కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 15

PUBLIC NOTICE

Under the instructions of my client, Mrs.NishaNagaraj, this notice is hereby given to the general public that my client is the owner of the property being Flat no.103(in First Floor) with a built up area of 1105.0 Sft (including common area) and 80.0 Sft car parking area, together with undivided share of land admeasuring 40.0 Sq.yds (out of 824.93 Sq.yds), of "Brundavan Heights", on Plot no.22, in Sy.no.94/Part, Situated at Nizampet Village, Quthbullapur Mandal, Ranga Reddy District having acquired the same vide a Registered Sale Deed bearing doc no. 5799 of 2016 dated 13.06.2016 from Mrs.K.Vara Lakshmi; who in turn acquired the same vide Registered Gift Settlement Deed doc no.4805 of 2016 dated 16.05.2016 from her husband Mr.K.Subba Raju.
It is informed to the general public that my client, has lost/misplaced the original link document of the property i.eRegistered Gift Settlement Deed doc no.4805 of 2016 dated 16.05.2016and the same is not available in original with my client.
It is further informed that, any person who has foundor who finds the above mentioned Title deed, may return the same by way of registered post to the address given below or inform the undersigned by telephone, any person/(s) having any objections, claims, right, lien, title over the said property may please contact the under signed within 10 days from the date of publication of this notice with relevant documents in support of their claim.
Sd/- SriramRegani,Advocate,
Flat no.307,
MNK'S Vittal's Central Court, New Bhoiguda, Secunderabad-500003.